## క్లుప్తంగా

### ఫార్మసీ విద్యార్థిని అనసూర్యకు అరుదైన గౌరవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ నాల్గవ సంవత్సరం చదువుతున్న తన్నీరు అనసూర్యకు అరుదైన గౌరవం లభించింది. చెన్నైకు చెందిన ఎడ్యువర్సిటీ అడ్మిషన్ ఎక్స్‌పో 2023 నిర్వహించిన జర్నీ టు ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ పోటీల్లో బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ ఇన్ ఫార్మసీ 2023 అవార్డును అందుకుంది. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 75 మంది విద్యార్థులు పోటీ పడగా అనసూర్యకు ఆ ఘనత దక్కింది. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, ఇతర అధ్యాపకులు అవార్డు పొందిన అనసూర్యకు అభినందనలు తెలిపారు.

### ఆశ్రయం కల్పించడం అభినందనీయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): అనాథలైన వృద్ధులకు నైట్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించడం అభినందనీయమని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. సొరంగం వద్ద నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌ను ఆమె శనివారం పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరూ లేని వృద్ధులు, తమ బాగోగులను పిల్లలు పట్టించుకోకపోతే బయటకు వచ్చేసిన వారికి షెల్టర్ కల్పించడం అభినందించతగ్గ విషయమన్నారు. ఒక వృద్ధురాలు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకోకపోగా ఆమెను రక్షించి నైట్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె శకుంత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, నైట్ షెల్టర్ ఇన్‌చార్జ్ మమత తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి కేబీఎన్‌లో ఉచిత ఓరియంటేషన్ తరగతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మే ఒకటో తేదీ నుంచి ఉచితంగా ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తెలిపారు. ఉన్నత పాఠశాల్లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మే ఒకటి నుంచి ఆరో తేదీ వరకూ ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకూ తరగతులు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సహా అన్ని రకాల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పాల్గొనవచ్చన్నారు. తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదన్నారు. తరగతుల్లో నూతన విద్యావిధానం ప్రతిపాదిస్తున్న ప్రమాణాలకు అనుగుణంగా నూతన బోధన పద్ధతులు, ప్రశ్న పత్రాల తయారీ, మూల్యాంకన విధానాలు, కో కరికులర్ యాక్టివిటీస్, క్రాస్ కరికులర్ అప్రోచ్, ప్లే మేథడ్స్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా సైన్స్ ప్రయోగాల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. మే ఒకటో తేదీ జరిగే తరగతుల ప్రారంభోత్సవ సభకు ఏపీ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డీ దేవానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. శిక్షణ పొంద దలుచుకున్న ఉపాధ్యాయులు కళాశాల కార్యాలయంలో నేరుగా లేదా 9032044115 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# విద్యా రంగంలో అత్యుత్తమ ప్రమాణాలు

**ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చిత్రంలో హైస్కూల్ కమిటీ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగంలో అత్యుత్తమ ప్రమాణాల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివసరావు అన్నారు. కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్లో నూతనంగా ప్రవేశ పెట్టిన ఆంగ్ల మాధ్యమ పాఠశాలను శనివారం వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. తొలుత పాఠశాల ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాల ఇంగ్లిష్ మీడియం శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి మాట్లాడుతూ తాను చదువుకున్న హిందూ హైస్కూల్ ఇక నుంచి పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోకి మారటం ఆనందంగా ఉందన్నారు. తనకు ఉన్నత విలువలు నేర్పిన పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఎటువంటి వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా హిందూ హైస్కూల్స్ కమిటీ సభ్యులు విద్యాసేవలో తరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదవాలని కోరుకుంటున్నారని, అది గమనించిన ముఖ్యమంత్రి ఆంగ్ల మాధ్యమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్యారంగంలో ప్రభుత్వం అనేక సంస్కరణలను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, జేవికె కిట్లు, వసతి దీవెన, విదేశీ విద్యా పథకం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి దేశవ్యాప్తంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థి ఉన్నతి సాధించాలంటే అందులో తల్లిదండ్రుల పాత్ర కూడా అమోఘమైందన్నారు. విద్యారంగంలో నానాటికీ వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ ఉపాధ్యాయులు తమలోని లోటుపాట్లను సరిచేసుకొని విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని సూచించారు. కమిటీ కోశాధికారి గోళ్ళ బాబా విజయకుమార్, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 120 ఏళ్ల హిందూ హైస్కూల్లో కేవలం విద్యకే పరిమితం కాకుండా జాతీయస్థాయిలో క్రీడల్లోనూ, ఎన్‌సీసీ, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి విభాగాల్లో విద్యార్థులను మేటిగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో మాదిరిగానే భవిష్యత్తులో ఆంగ్ల మాధ్యమం పాఠశాలను విద్యార్థుల తల్లిదండ్రులు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కేవీఎల్వీ మోహనరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల కార్యదర్శి చిట్టా రాజశేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు సోము భరత్ కుమార్, జే ఆనందకుమార్, డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, యు వెంకటేశ్వరరావు, కే శ్రీనివాస్, జీ పురుషోత్తం, ఎస్ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు చర్యలు

**కలెక్టర్ ఢిల్లీరావు**



విద్యార్థినులకు మాత్రలు అందిస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో రక్తహీనత నివారించేందుకు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా అందించాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. పటమట లంకలోని కేఎస్ఆర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో రక్తహీనత తగ్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విద్యాసంస్థలకు దాదాపు 45 రోజుల పాటు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో మాత్రల వాడకం నిరంతరం జరగాలని, ఆరు వారాలకు సరిపడా మాత్రలు తల్లిదండ్రులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యానికి కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సి. రేణుక మాట్లాడుతూ జిల్లాలో 728 పాఠశాలల్లో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి 13,491 మంది విద్యార్థులకు మైల్డ్, 15,648 మంది విద్యార్థులకు మోడరేట్, 129 మంది విద్యార్థులకు సివియర్ రక్తహీనత ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. వేసవి సెలవుల్లో వినియోగించేలా ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి. మాధవి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేవి ఎల్ఎస్ కుమార్, డెప్యూటీ డీఈవో కొండ రవికుమార్, ఎస్‌పిహెచ్‌వో నరసింహానాయుడు, పీహెచ్‌సీ డాక్టర్ మొబిన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా పాండురంగడి పుష్పయాగం



పుష్పయాగంలో పాండురంగడి ఉత్సవమూర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలో వేంచేసి ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగ, సంతాన వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి పుష్పయాగం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తొలుత రుక్మాబాయి సమేత పాండురంగడి ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామి వారి నామాలను పఠిస్తూ, కీర్తనలు ఆలపిస్తూ పుష్పయాగం చేశారు. సుమారు రెండు గంటల పాటు భక్తుల నామస్మరణలు, మంగళవాయిద్యాలు, అర్చకస్వాములు మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి పుష్పయాగం రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి వారికి వివిధ రకాల పుష్పాలను సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం తదితర కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వైదిక కార్యక్రమాలను అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు.

### నగరాభివృద్ధికి నిబద్ధతతో కృషి



పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయటానికి తాము నిబద్ధతతో కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 18 అంశాలు ఎజెండాలోకి రాగా అందులో 16 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరొకటి ర్యాటిఫై చేశారు. స్థాయీ సంఘం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

### జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

**ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు**

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతూ చర్చా వేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రూప్ 1,2,3,4 నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయనందున వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని విన్నవించారు. లైబ్రేరియన్ పోస్టులను గత ఎనిమిదేళ్లుగా భర్తీ చేయడం లేదని, వాటికి కూడా నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలిపారు.

### గొల్లపూడి ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

భవానీపురం(విజయవాడపశ్చిమ): జేఈఈ మెయిన్స్ 2023 ఫలితాల్లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారిలో నవీన్‌కుమార్ (ఆలిండియ ర్యాంక్ 232, హాల్ టికెట్ నెంబర్. 230310728625), నరసింహస్వామి (ఆలిండియా ర్యాంక్ 848, హాల్ టికెట్ నెంబర్. 230310247519) సాధించారని ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ జనరల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను అభినందించినవారిలో డీజీఎం రమణ, అకడమిక్ డీన్ అరవింద్, ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

# వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులై టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. భవానీపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాసరావు నేతృత్వంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్ సమక్షంలో శనివారం 200 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వెలంపల్లి శ్రీనివాసరావు ఆహ్వానించారు. తొలుత ఆకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. వైఎస్సార్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి, సీతన్నపేట వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు మాట్లాడుతూ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఖాళీ అవుతున్నాయన్నారు. జగన్ వల్లే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి కార్పొరేటర్లు, పాదిలి చంటి బాబు, సలీంఫర్వేజ్, అల్లం పూర్ణచంద్రరావు,యరజర్ల మురళి, ఏలూరు వెంకన్న, పోతిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్‌కు వీల్‌చైర్స్ అందజేత



సీనియర్ డీసీఎం రాంబాబుకు వీల్‌చైర్స్ అందిస్తున్న రోటరీ మిడ్‌టౌన్ ప్రతినిధులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, దివ్యంగ ప్రయాణికుల సౌకర్యార్థం రోటరీ మిడ్‌టౌన్ స్వచ్ఛంద సంస్థ 5 వీల్ చైర్స్‌ను అందించింది. ఈ మేరకు రోటరీ మిడ్‌టౌన్ డిస్ట్రిక్ గవర్నర్ ఏకేఎస్ భాస్కర్‌రామ్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబుకు చైర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం రాంబాబు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా రోటరీ మిడ్‌టౌన్ ప్రతినిధులు తమ దాతృత్వం చాటుకుంటు సమాజ సేవలో పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. సీనియర్ సిటిజన్‌లు, ఆర్థరైటిస్ రోగులు, దివ్యంగ ప్రయాణికులు రైలు ఎక్కేందుకు, బయటకు వచ్చేందుకు వీల్ చైర్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వీల్ చైర్‌లు అవసరమైన ప్రయాణికులు 1వ నెంబర్ ప్లాట్‌ఫాంలోని ఐఆర్‌సీటీసీ కియోస్క్ లేదా లైసెన్స్ పోర్టర్‌ల ద్వారా నామమాత్రపు రుసుం చెల్లించి ఉపయోగించుకోవాలని సూచించారు. స్టేషన్ డైరెక్టర్ పీబీన్ ప్రసాద్, రోటరీ మిడ్‌టౌన్ ప్రతినిధలులు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్‌పి శ్రీనివాస్, టిక్కెట్ చెక్కింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు



కె.సాయినాథ్‌శ్రీమంత్ 10వ ర్యాంకు



ఎన్.ధరమ్‌తేజ్‌రెడ్డి 42వ ర్యాంకు



డి.వెంకట యోగేష్ 43వ ర్యాంకు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్–2023 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఆలిండియా ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఈజీఎం ఎం.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరిలో ఆలిండియాలో మొదటి నుంచి పది ర్యాంకులతో పాటుగా 100లోపు 23 ర్యాంక్‌లు తమ విద్యాసంస్థ కైవసం చేసుకుందని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో విజయవాడ నగరానికి చెందిన కె.సాయినాథ్ శ్రీమంత్ 10వ ర్యాంకు పొందారని తెలిపారు. వంద లోపు 9 ర్యాంకులు, 200 లోపు 19 ర్యాంకులు, 500 లోపు 37 ర్యాంకులు, 1000 లోపు 65 ర్యాంకులు పొందారని తెలియజేశారు. ఈ విజయాలు ఒక్క విజయవాడ శ్రీచైతన్య విద్యార్థులవేనన్నారు. ఇంతటి ఘన విజయం మరే ఏ ఇతర విద్యాసంస్థలకు రాలేదని తెలిపారు. అపూర్వ విజయాన్ని సాధించడంలో దోహదపడిన విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు శ్రీచైతన్య విదాసంస్థల చైర్మన్ బీఎస్.రావు, అకడమిక్ డైరెక్టర్ సుష్మతో పాటుగా విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్స్ పి.వెంకటేశ్వరరావు, పి.మురళీరావు, కె.శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శారద విద్యార్థుల ప్రతిభ



యు.లిఖిత(902)



డి.బద్రినాథ్(916)



జి.తేజస్విని(1024)

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ–మెయిన్స్–2023 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరిల్లో మంచి ర్యాంకులు సాధించారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో యు.లిఖిత (902), డి.బద్రినాథ్ (916), యం.గణేష్ పవన్ గోకుల్(1296), కె.విధాత్రి (1926), యం.కీర్తన (2302), జి.షణ్ముఖరెడ్డి(2435), వి.అభిఘ్నశ్రీ (3322), వి.కీర్తన (4486), జి.తేజస్విని (2824), వై.ఝాన్సీలక్ష్మీ (3686) ర్యాంకులు పొందారని పేర్కొన్నారు. తమ విద్యాసంస్థ నుంచి మొత్తం 650 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కాగా వారిలో 350 మందికి పైగా మంచి ర్యాంకులు పొందారని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి పేర్కొన్నారు. ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్య, విద్యార్థుల క్రమశిక్షణ, ఆన్‌లైన్ పరీక్షా ప్రణాళిక విద్యార్థులకు ఎంతో అనుకూలించిందని తెలిపారు. ర్యాంకులు పొందిన విద్యార్థులకు కళాశాల సలహాదారుడు ఈఎస్ ఆర్‌కే ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు అభినందించారు.

# వావిలాల సేవలు అపూర్వం



వావిలాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరహరశెట్టి శ్రీహరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య దేశానికి అందించిన సేవలు అపూర్వమని సర్వోదయ మండలి నగర అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య వర్థంతిని పురస్కరించుకొని ఆ సంస్థ కార్యాలయంలో శనివారం సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి వావిలాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, గ్రంథాలయోద్యమ నాయకునిగా, శాసనసభ్యునిగా, రాజకీయ నేతగా, మద్యవిమోచన ప్రచార కార్యకర్తగా వావిలాల బహుముఖంగా దేశానికి సేవలందించారని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వావిలాల నాలుగు పర్యాయాలు శాసనసభ్యునిగా ఎన్నికై మచ్చలేని నేతగా పేరు పొందారన్నారు. తరాలు మారినా సామాజిక సేవ, రాజకీయ రంగాల్లో తనదైన ప్రత్యేక ముద్ర వేసిన వావిలాల నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆయన స్ఫూర్తిని నేటి తరం నాయకులు అందిపుచ్చుకోవాలని కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఎస్.జ్యోతి, నాయకులు ఎస్.రత్నకుమారి, ఎస్‌డీవీ ప్రసాద్, ఎం.రామారావు పాల్గొన్నారు.

## • నటరాజుకు నాట్య వినోదం..



నటరాజు రామకృష్ణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు రోజా, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, లక్ష్మీ పార్వతి తదితరులు



నృత్య కళాకారులతో మంత్రి రోజా తదితరులు

ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం, నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ శత జయంతి సభ తుమ్మపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. వందలాది మంది కళాకారులు చేసిన నృత్యాలు మనోహరంగా సాగాయి. మంత్రులు రోజా, అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



### ప్రకటన

[illegible]

ఇట్లు

డి.పి. రామకృష్ణ, జి. రామారావు, డి. వృద్ధి న్యాయవాదులు,
డోర్. నెం. 59-5-2, ITI, బస్టాపు లైన్, అశోక్ నగర్,
విజయవాడ-10 ✆ 9849082858